క్లుప్తంగా

ఎంపీడీఓగా సాయిలహరి బాధ్యతల స్వీకరణ

ఇందుకూరుపేట: మండల పరిషత్ అభివృద్ధి అధికారిణిగా సాయిలహరి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా చిట్టమూరు మండల ఎంపీడీఓగా పనిచేస్తున్న ఆమె ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేస్తున్న నాగరాజు చిట్టమూరు మండలానికి వెళ్లారు. నూతన ఎంపీడీఓను మండల పరిషత్ సూపరింటెండెంట్ ఉషారాణి, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు పవన్, కుమార్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎంపీడీఓ మండలాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు.

పూర్వవిద్యార్థుల సేవలు స్ఫూర్తిదాయకం



కోవూరు: తమకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాల అభివృద్ధికి ఏమైనా చేయాలనే సంకల్పంతో పూర్వవిద్యార్థులు ముందుకురావడం స్ఫూర్తిదాయకమని ఇనమడుగు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని రాధారాణి అన్నారు. ఇనమడుగు జెడ్పీ ఉన్నత పాఠశాలకు 1986–87 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు హరిబాబు, అనిల్‌కుమార్, మురళి రూ.25 వేల విలువ చేసే మైక్‌సెట్‌ను శుక్రవారం బహూకరించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ పూర్వవిద్యార్థులు తమకు పాఠాలు నేర్పిన ప్రభుత్వ పాఠశాలలను గుర్తుచేసుకుని సేవలందిస్తే అవి మరింత పురోభివృద్ధి చెందుతాయన్నారు. అనంతరం పూర్వవిద్యార్థి, విజేత ఆంగ్ల మాధ్యమ పాఠశాల కరస్పాండెంట్ హరిబాబు మాట్లాడారు. గతంలో తాము ఉపాధ్యాయుల సూచనలు, సలహాలు తీసుకుని ఈ స్థాయికి చేరుకున్నామన్నారు. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని ఎంచుకుని దానిని సాధించే దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పదోతరగతి విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. పదిలో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు ప్రథమ బహుమతి రూ.5 వేలు, ద్వితీయ బహుమతి రూ.3 వేలు, తృతీయ బహుమతి రూ.2 వేలు చొప్పున అందజేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ రమేష్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పట్టపగలే ఇళ్లలో చోరీ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: దామరమడుగులో తాళం వేసిన ఇళ్లలో పట్టపగలే దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన శుక్రవారం జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. దామరమడుగుకు చెందిన కొండా అరుణ, రవీంద్రరెడ్డి దంపతులు శుక్రవారం ఉదయం ఇంటికి తాళం వేసి నెల్లూరులోని ఓ ఆస్పత్రికి వెళ్లారు. మధ్యాహ్నం ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళం, బీరువా పగులగొట్టి ఉన్నాయి. బీరువాలోని బంగారు సరుడు, ఉంగరం, రూ.లక్ష నగదు కనిపించలేదు. అదే విధంగా రామాలయం వీధిలోని మరో రెండు ఇళ్లలోనూ చోరీ జరిగింది. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు క్లూస్ టీంతో వేలిముద్రలు సేకరించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాల్మన్‌పురంలో..

మండలంలోని సాల్మన్‌పురంలో గ్రామదేవత సాల్మానంబ ఆలయంలో గురువారం అర్ధరాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. హుండీలో నగదుతో పాటు అమ్మవారి బంగారు ముక్కుపుడకను దోచుకెళ్లారు. స్థానికుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఆలయాన్ని పరిశీలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉమామహేశ్వరస్వామి దేవస్థానంలో పూజలు

నెల్లూరు(బృందావనం):మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని సీఏఎం హైస్కూల్ రోడ్డులోని ఉమామహేశ్వరస్వామి దేవస్థానంలో మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సహస్రనామ పూజలను శుక్రవారం నిర్వహించారు. పల్లకిసేవను నేత్రపర్వంగా జరిపారు. సాయిలలితా కూచిపూడి నృత్యనికేతన్ ఆధ్వర్యంలో శిరీష శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి, భరతనాట్యం అలరించింది. ఉభయకర్తలుగా బాలాజీసింగ్, లక్ష్మి దంపతులు వ్యవహరించారు.

సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం

నెల్లూరు(క్రైమ్): సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని.. మోసానికి గురైతే పోలీసులకు తక్షణమే ఫిర్యాదు చేయాలని ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి సూచించారు. సైబర్ నేరాలు, మోసాలకు గురికాకుండా పాటించాల్సిన జాగ్రత్తలను నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం ఆయన వివరించారు. పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేద్దామనుకునే వారిని లక్ష్యంగా చేసుకొని సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని చెప్పారు. వ్యక్తిగత సమాచారాన్ని ఎవరితో షేర్ చేయరాదని, సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయొద్దని సూచించారు. జిల్లాలో ప్రీపెయిడ్ టాస్క్‌ల ఫ్రాడ్ ద్వారా రూ.13 లక్షలు, నకిలీ వెబ్‌సైట్లలో ఇన్వెస్ట్‌మెంట్ పేరిట రూ.10 లక్షలు, యూట్యూబ్‌లో వీడియోలకు లైక్‌లు, రివ్యూల ద్వారా అధిక నగదును సంపాదించొచ్చని రూ.9.5 లక్షలు, విమాన టికెట్లు బుక్ చేస్తే అధిక నగదును సంపాదించొచ్చని రూ.3.5 లక్షల మేర సైబర్ నేరగాళ్లు కాజేశారనే ఫిర్యాదులు అందాయన్నారు. సాంకేతికత ఆధారంగా దర్యాప్తు చేస్తున్నామని వివరించారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన వారు రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన సైబర్‌మిత్ర వాట్సాప్ నంబర్ 91212 11100, 1930, ఎన్సీఆర్పీ పోర్టల్ cybercrime. gov. in లేదా స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేస్తే చర్యలు చేపడతారని చెప్పారు.

నరుకూరు నుంచి పార్టీ శ్రేణులతో కలిసి బైక్‌పై ర్యాలీగా వెళ్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



బీసీ గర్జన సభలో మాట్లాడుతున్న మంత్రి కాకాణి



బీసీలకు సముచిత న్యాయం

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

తోటపల్లిగూడూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో బీసీలకు సముచిత న్యాయం జరిగిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. సర్వేపల్లి నియోజకవర్గ స్థాయిలో బీసీలు సిద్ధం పేరుతో బీసీ గర్జన సభను మండలంలోని విలుకానుపల్లిలో శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. తొలుత 500 బైక్‌లపై పార్టీ శ్రేణులు నరుకూరు సెంటర్ నుంచి విలుకానుపల్లి వరకు చేపట్టిన భారీ ర్యాలీలో మంత్రి కాకాణి ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం విలుకానుపల్లిలోని టీఎంఎస్సార్ కన్వెన్షన్‌లో జరిగిన బీసీ గర్జన సభలో మంత్రి కాకాణి ప్రసంగించారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లులా భావించి ప్రజాసంక్షేమానికి పాటుపడ్డారన్నారు. గత ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను సంపూర్ణంగా అమలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పెద్ద ఎత్తున పింఛన్లను వలంటీర్ల ద్వారా లబ్ధిదారుల ఇంటి వద్దకే చేరుస్తూ ఇచ్చిన మాట ప్రకారం రూ.3 వేలు అందిస్తున్న జగనన్నకు ఎవ్వరూ సాటిరారన్నారు. బీసీలకు సంబంధించి నాటి టీడీపీ పాలనలో తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. తమ ప్రభుత్వంలో బీసీలకు అన్ని రంగాల్లో న్యాయం జరిగిందన్నారు. బీసీల సంక్షేమానికి అహర్నిశలు శ్రమించిన సీఎంగా వైఎస్ జగన్ నిలిస్తే, బీసీలను అన్ని విధాలా వంచించిన సీఎంగా చంద్రబాబునాయుడు నిలిచారన్నారు. పార్టీ పరంగా, పాలనాపరంగా బీసీలకు అత్యంత ప్రాధాన్యమిచ్చామన్నారు. సర్వేపల్లి నియోజకవర్గానికి సంబంధించి ఎమ్మెల్యేగా, మంత్రిగా బీసీల తోడు నడిచానన్నారు. అందుకే నియోజకవర్గంలోని పేద, మధ్య తరగతి ప్రజలు, బీసీలు తన పక్షాన ఉంటే ధనవంతులు, కాంట్రాక్టర్లు సోమిరెడ్డి పక్షాన ఉన్నారన్నారు. సోమిరెడ్డికి ఎవ్వరైనా వినతిపత్రాలు తీసుకెళ్తే చిరాకు అన్నారు. ఆయనకు కరెన్సీ మీద ఉన్న క్రేజ్ పేదల సమస్యలపై లేదన్నారు. సర్వేపల్లిలో సీనియర్ నాయకుడైన సోమిరెడ్డికి టిక్కెట్ ఖరారుకాకపోవడం బాధాకరంగా ఉందన్నారు.ఆయనపైనే పోటీ బాగుంటుందని, ఆయనకే టిక్కెట్ ఖరారు కావాలని ఆశిస్తున్నామన్నారు. బీసీలపై కపట ప్రేమ చూపిస్తున్న చంద్రబాబు, సోమిరెడ్డికు మరోసారి చుక్కలు చూపించేందుకు బీసీలు సిద్ధంగా ఉన్నారన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో రెండుసార్లు ఎమ్మెల్యేగా తన విజయంలో కీలక పాత్ర పోషించిన బీసీలను ఎప్పటికీ మరిచిపోనన్నారు. మరోసారి తనకు అవకాశం కల్పిస్తే బీసీల రుణం తీర్చుకుంటానన్నారు. అనంతరం మంత్రి కాకాణిని బీసీ నేతలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్ కో–ఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్ చిల్లకూరు సుధీర్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్, ఎంపీపీ ఉప్పల స్వర్ణలత, జెడ్పీటీసీ సభ్యులు ఎంబేటి శేషమ్మ, జిల్లా బీసీ నేతలు తలమంచి సురేంద్రబాబు, నెల్లూరు శివప్రసాద్, మన్నెం సుబ్రహ్మణ్యంగౌడ్, మందల వెంకటశేషయ్య, మన్నెం చిరంజీవులగౌడ్, కోనా బ్రహ్మయ్య, గండవరపు సుగుణ, దాసరి భాస్కర్‌గౌడ్, చెరుకూరు శ్రీనివాసులనాయుడు, కాల్తిరెడ్డి సుబ్రహ్మణ్యం, ఆకుల మధు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో 20 కుటుంబాల చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో మంత్రి కాకాణి

వెంకటాచలం: మండలంలోని కసుమూరుకు చెందిన పలువురు శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. టీడీపీకి చెందిన మందా చిన్నయ్య, కడివేటి డేవిడ్‌రాజు, మందా కృష్ణ, దినేష్, ఇరిమిరాజుతో పాటు 20 కుటుంబాల వారు మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి మంత్రి కాకాణి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరినట్లుగా వారు తెలిపారు. నెల్లూరులోని మంత్రి కాకాణి నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, కసుమూరు సర్పంచ్ కడివేటి శివ, నాయకులు చీకుర్తి నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

మేజర్ డ్రెయిన్ పనులకు మోక్షం



డ్రెయిన్ పనులను పరిశీలిస్తున్న డీఈ లీలాప్రకాష్

కోవూరు : కోవూరులోని మేజర్ డ్రెయిన్ అభివృద్ధి పనులకు ఎట్టకేలకు పంచాయతీ పాలకవర్గం నడుంబిగించింది. శరవేగంగా సాగుతున్న ఈ పనులను ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ లీలాప్రకాష్, ఏఈ జగదీష్ శుక్రవారం పరిశీలించారు. కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ డ్రెయిన్ పనులను నాణ్యత ప్రమాణాలతో నిర్దేశించిన నిబంధనలకు లోబడి చేపట్టాలని సూచించారు. వారి వెంట సర్పంచ్ విజయ, ఉపసర్పంచ్ మైనుద్దీన్, వార్డు సభ్యులు అత్తిపల్లి అనూప్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



కోవూరు : మండలంలోని వేగూరులోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ విజయశ్రీ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అవసరమైన వసతులు ఉన్నాయా..లేవా అని పరిశీలిస్తున్నామని తెలిపారు. ఆమె వెంట రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రమణయ్య, వీఆర్వో మల్లికార్జున ఉన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు



మనుబోలు: పరీక్షలు రాసి బయటకొస్తున్న విద్యార్థులు



పొదలకూరు: హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



వెంకటాచలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద విద్యార్థుల హడావుడి

మనుబోలు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు జరిగిన ప్రథమ సంవత్సరం పరీక్షలకు జూనియర్ కళాశాల విద్యార్థులు 58 మంది, హైస్కూల్ ప్లస్ విద్యార్థులు 35 మంది కలిపి మొత్తం 93 మంది పరీక్షలకు హాజరైనట్లు అధికారులు తెలిపారు. పరీక్ష కేంద్రంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా అన్ని తరగతి గదుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. కళాశాల పరిసరాల్లో 44 సెక్షన్ అమలు చేశారు. పరీక్షలను చీఫ్ ఎగ్జామినర్ దిలీప్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ ప్రసాద్ పర్యవేక్షించారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

పొదలకూరు : పట్టణంలో కాకతీయ, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

వెంకటాచలం: మండల కేంద్రమైన వెంకటాచలంలో ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు రైల్వేగేట్ సమీపంలోని రావూస్ కళాశాలలో జరిగిన పరీక్షలకు 282 మంది విద్యార్థులకు గానూ 274 మంది విద్యార్థులు హాజరయ్యారు. 8 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. రెండు పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

బీసీ గర్జన సభకు తరలిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు



మనుబోలు: తోటపల్లిగూడూరు మండలంలో శుక్రవారం తలపెట్టిన బీసీ గర్జన సభకు మనుబోలు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. మంత్రి కాకాణి పిలుపుతో మనుబోలు, కట్టువపల్లి, జట్లకొండూరు, గురివిందపూడి, కొమ్మలపూడి, కాగితాలపూరు, మడమనూరు తదితర గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో బయలుదేరి వెళ్లారు.

దివ్యాంగులకు వీల్‌చైర్స్ పంపిణీ



వెంకటాచలం: అంతర్జాతీయ వీల్‌చైర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని సరస్వతీనగర్ వద్ద ఉన్న దివ్యాంగుల ప్రాంతీయ సంయుక్త కేంద్రం(సీఆర్సీ)లో దివ్యాంగులకు వీల్‌చైర్స్‌ను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఆర్సీ డైరెక్టర్ మనోజ్‌కుమార్ మాట్లాడుతూ దివ్యాంగులకు సమాజం అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. సీఆర్సీలో దివ్యాంగులకు పలు కోర్సుల్లో శిక్షణ ఇవ్వడంతో పాటు ఉపాధి కల్పిస్తున్నామని తెలిపారు. దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలను పంపిణీ చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు పాల్గొన్నారు.

వవ్వేరు కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్‌గా టంగుటూరు



మల్లికార్జున్‌రెడ్డి

కోవూరు : బుచ్చిరెడ్డిపాళెంలోని వవ్వేరు కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్‌గా టంగుటూరు మల్లికార్జున్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర కార్పొరేషన్ అండ్ రిజిస్ట్రార్ ఆఫ్ కోఆపరేటివ్ సొసైటీస్ కమిషనర్ నుంచి శుక్రవారం ఆదేశాలు అందాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా బ్యాంకు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. తనపై నమ్మకం ఉంచి తనకు పదవీ బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు



గాయపడిన వినోద్

పొదలకూరు : మండలంలోని సంగం–పొదలకూరు మార్గంలో ఉన్న కిసాన్ క్రాఫ్ట్ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు..సైదాపురం మండలం మునగపాడు గ్రామానికి చెందిన వినోద్ బైక్‌పై మహ్మదాపురం గ్రామానికి వివాహానికి హాజరయ్యేందుకు బయలుదేరాడు. కిసాన్‌క్రాఫ్ట్ సమీపంలో బైక్ అదుపుతప్పడంతో వినోద్ తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడ్ని 108 సిబ్బంది పొదలకూరు సీహెచ్‌సీకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత



రామచంద్రయ్యకు పింఛన్ ఇస్తున్న వలంటీర్ రవికిరణ్



పెంచలయ్యకు పింఛన్ ఇస్తున్న వలంటీర్ విజయకుమార్

కోవూరు : మండలంలోని పడుగుపాడు–2 సచివాలయం పరిధిలోని చంద్రమౌళినగర్ గిరిజన కాలనీకి చెందిన పెంచలయ్య అనారోగ్యంతో నెల్లూరులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం కుటుంబ సభ్యుల ద్వారా తెలుసుకున్న కల్లూరు విజయ్‌కుమార్ శుక్రవారం ఆస్పత్రికి వెళ్లి రూ.3వేలు పింఛన్ నగదు అందజేశారు. దీంతో పెంచలయ్య వలంటీర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

ఇందుకూరుపేట: మండలంలోని కొమరికకు చెందిన ఉప్పలపాటి రామచంద్రయ్య అనారోగ్యంతో నెల్లూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ఆయనకు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు గూడూరు ప్రభాకర్‌రెడ్డి సూచనలతో వలంటీర్ పాముల రవికిరణ్ శుక్రవారం నెల్లూరులోని ఆస్పత్రికి వెళ్లి పింఛన్ నగదు అందజేశారు. దీంతో రామచంద్రయ్య కుటుంబసభ్యులు వలంటీర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేయండి



మనుబోలు: మండలంలో ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ విజయవంతం చేయాలని మనుబోలు పీహెచ్‌సీ వైద్యాధికారిణి మోహిసినా సుల్తానా కోరారు. మనుబోలు పీహెచ్‌సీలో పల్స్‌పోలియోపై వైద్యారోగ్య సిబ్బంది, అంగన్‌వాడీలకు శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని ఐదేళ్లలోపు చిన్నారులు 4,568 మందిని గుర్తించామని తెలిపారు. వారికి పల్స్‌పోలియో చుక్కలు వేసేందుకు 40 కేంద్రాలతో పాటు ఒక మొబైల్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో పాటు 45 మంది సిబ్బందిని కేటాయించామని వివరించారు. మండలంలోని ఐదేళ్లలోపు చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి నూరుశాతం లక్ష్యాన్ని సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ రాజయ్య, హెల్త్‌సూపర్‌వైజర్లు హైమావతి, రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు నిరంతర ప్రక్రియ



మాట్లాడుతున్న ఈఆర్వో ఎం శ్రీనివాసులు

కోవూరు : ప్రజాస్వామ్య దేశంలో ఓటరు నమోదు నిరంతర ప్రక్రియ అని కోవూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం శ్రీనివాసులు అన్నారు. కోవూరులోని సంఘమిత్ర కార్యాలయ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఓటరు నమోదుపై యువతకు అవగాహన కల్పించామని తెలిపారు. ఇంకా 18 ఏళ్లు నిండి ఓటు హక్కు లేని వారు ఎవరైనా ఉంటే ఓటు నమోదు చేసుకునేలా చూడాలన్నారు. ఇటీవల నూతన ఓటర్ల జాబితాను ప్రకటించామని, అందులో ఏమైనా తప్పొప్పులు ఉంటే తమ దష్టికి తీసుకురావాలని కోరారు. ఈ సమావేశంలో ఎలక్షన్ డీటీలు మధు, రవికుమార్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఉన్నారు.